క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్టి



హోమానికి హాజరైన భక్తులు

మార్కాపురం: పట్టణంలోని నెహ్రూ బజారులో ఉన్న షిర్డీ సాయిబాబా మందిరంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా ఆలయంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష పూజలు, చండీ హోమం నిర్వహించారు. నవంబర్ 28 నుంచి సోమవారం వరకు రోజూ స్వామివారికి అభిషేకాలు నిర్వహించినట్లు మందిర అధ్యక్షుడు గోపాలుని హరిహరరావు తెలిపారు. అనంతరం విష్ణు సహస్ర నామ అఖండ పారాయణ మహాయగ్నం నిర్వహించారు. ఈ నెల 24వ తేదీ వరకు మహాయగ్నం కొనసాగుతుందని, 24వ తేదీన లక్ష్మీ నారాయణ హోమం నిర్వహిస్తామని తెలిపారు.

ధనుర్మాసంలో వైష్ణవ ఆలయాలకు బస్సులు

పొదిలి రూరల్: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలో పలు వైష్ణవాలయాలను దర్శించుకునేందుకు పొదిలి డిపో నుంచి ప్రత్యేక టూర్ ప్యాకేజీ అందిస్తున్నట్లు డిపో మేనేజర్ జె.సుందరరావు తెలిపారు. అంతర్వేది(లక్ష్మీ నరసింహ స్వామి), వాడపల్లి (వెంకటేశ్వర స్వామి), మండపేట(వెంకటేశ్వర స్వామి), ద్వారకా తిరుమల(చిన్న తిరుపతి), మంగళగిరి(పానకాల లక్ష్మీనరసింహ స్వామి) ఆలయాలకు ప్రత్యేక ప్యాకేజీతో బస్సులు నడుపుతున్నట్లు వివరించారు. ఆయా ప్రదేశాలకు చార్జీ సూపర్ లగ్జరీకి రూ.1800, ఎక్స్‌ప్రెస్‌కు రూ.1400గా నిర్ణయించినట్లు వెల్లడించారు. అలాగే బ్రహ్మంగారి మఠం, ఒంటిమిట్ట(రామాలయం), పెంచలకోన (లక్ష్మీ నరసింహ స్వామి), రంగనాయక స్వామి, వెంకయ్య స్వామి, వెంగమాంబ గుడికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఆయా ఆలయాలకు చార్జీ సూపర్‌లగ్జరీకి రూ.1500, ఎక్స్‌ప్రెస్‌కు రూ.1200గా నిర్ణయించినట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు 9959225700ను సంప్రదించాలని కోరారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ



ప్రింటర్ అందుకుంటున్న హెచ్‌ఎం

పొదిలి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు జెరాక్స్ కమ్ ప్రింటర్‌ను పూర్వ విద్యార్థులు సోమవారం బహూకరించారు. పాఠశాల పూర్వ విద్యార్థి ఏవీఎం రావు వృత్తి రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నారు. తనకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు తోడ్పాటునందించాలని భావించి రూ.27,700 విలువైన జెరాక్స్ కమ్ ప్రింటర్‌ను కొనుగోలు చేశారు. పాఠశాల హెచ్‌ఎం డీవీ పద్మావతికి దాత తరఫున సుజాత మెడికల్స్ యజమాని రావూరి సుధాకర్‌రావు అందజేశారు. దాతకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు



ర్యాలీ నిర్వహిస్తున్న సొసైటీ సభ్యులు

మార్కాపురం: ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానేసేందుకు అందరూ సహకరించాలని నివేదిత రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ బి.కళావతి కోరారు. ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలను వివరిస్తూ సోమవారం స్థానిక సుందరయ్య కాలనీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు, సీసాలను సక్రమంగా నిర్మూలించకపోవడం వల్ల ఏళ్లతరబడి భూమిపై పేరుకుపోతున్నాయని, వాటిని ఆవులు, గేదెలు తిని మరణిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సుధారాణి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



దర్శి: కట్ చేస్తున్న క్రిస్మస్ కేక్



వెలుగు కార్యాలయంలో పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేస్తున్న సంఘ సభ్యులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని ఎస్సీ, బీసీ కాలనీలోని వెలుగు కార్యాలయంలో జీసెస్ లవ్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లకు ఫౌండర్ గుర్రం శేఖర్ దుస్తులు అందించారు. ఈ సందర్భముగా డాక్టర్ ఐజక్ సుందరరాజు వాక్యోపదేశం చేశారు. పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి అగస్టీన్, పాస్టర్లు పి.శామ్యూల్, జాన్ రంగయ్య, రిటైర్డ్ తహసీల్దార్ జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్ ఆఫ్ కంపాషన్ కార్యాలయంలో..

హ్యాండ్ ఆఫ్ కంపాషన్(హెచ్‌ఓసీ) కార్యాలయంలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురికి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ బెంజిమెన్, సంస్థ డైరెక్టర్ విజయబాబు, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్, న్యాయవాది ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

దర్శి: మండల సమాఖ్య ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్ కేసనపల్లి విజయ్‌కుమార్ క్రిస్మస్ సందేశం అందించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ సందర్భంగా పాస్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ సమస్త మానవాళి క్రీస్తు బోధనలను క్రమశిక్షణతో జీవితాలను సరిదిద్దుకోవాలని సూచించారు. క్రీస్తు బోధనలు అందరికీ ఆశ్చర్యం కావాలని తన సందేశంలో వివరించారు. డీఎంజీ కొప్పుల నాగభూషణరావు, ఏరియా కో ఆర్డినేటర్ వసుందరాదేవి, ఏపీఎం విజయ్‌కుమార్ సీసీలు బ్రహ్మయ్య, ఫణిబాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి అభయం ఆరోగ్యశ్రీ పథకం



కరపత్రాలు విడుదల చేస్తున్న కమిషనర్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు, పక్కన సీఐ, ఎంపీపీ, ఎంపీడీఓ

మార్కాపురం రూరల్: ఆరోగ్య శ్రీ పరిమితిని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.25 లక్షలకు పెంచారని ఎంపీడీఓ తోట చందన పేర్కొన్నారు. ఆరోగ్య శ్రీపై సోమవారం సీఎం వైఎస్ జగన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి ఆమె హాజరయ్యారు. డీఐఎంహెచ్‌ఓ పద్మావతి, జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ ఎస్. సుబ్బారెడ్డి, సీనియర్ మెడికల్ ఆఫీసర్ రాహుల్, సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, ఎంపీపీ పోరెడ్డి అరుణ, డాక్టర్ రోహిత్, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీతో వైద్యం ఉచితం

దర్శి: వైద్యం ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా పొందవచ్చని నగర పంచాయతీ కమిషనర్ మహేశ్వరరావు తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ అనంతరం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం కింద ఉచితంగా వైద్యం పొందటం ఎలా? అనే బ్రోచర్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ పీహెచ్‌సీ, 104 కాల్ సెంటర్, 108 అంబులెన్స్, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్‌ల ద్వారా ఆరోగ్యశ్రీ పొందవచ్చని చెప్పారు. ప్రతి రోజు ఆస్పత్రుల్లో ఉచిత సేవలు అందించడమే లక్ష్యంగా వైద్యులు పని చేస్తున్నారని చెప్పారు. డీటీ రవిశంకర్, పీహెచ్‌సీ వైద్యులు కిరణ్మయి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, మండల, పట్టణ కన్వీనర్‌లు వెన్నపూస వెంకటరెడ్డి, కట్టికోట హరీష్, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు షేక్ సైదా, సంఘ సేవకుడు జీవీ రత్నం, జేసీఎస్ పట్టణ కన్వీనర్ ఎదురు కోటిరెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ రాము పాల్గొన్నారు.

శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలి

బేస్తవారిపేట: గ్రామాల్లోని ఎస్సీలకు శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ బూదాల ఆనంద్ కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ డీవీబీ వరకుమార్‌కు ఆయన వినతి పత్రం అందచేశారు. అనేక గ్రామాల్లో దళితులకు శ్మశాన వాటికలు లేకపోవడం, సరైన రోడ్డు వసతి లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంబేడ్కర్ కాలనీలో 400 కుటుంబాలకు రేషన్ వాహనం రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. 2 కిలోమీటర్ల దూరం వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సి ఉందని, కనీసం కాలనీ సమీపంలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఎం.ప్రవీణ్, మీగడ నాగేశ్వరరావు, నాగ నరసింహులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గిద్దలూరు రూరల్: మండలంలోని దళితులకు శ్మశాన స్థలం కోసం, వాటికి వెళ్లేందుకు దారిలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు దుగ్గెపోగు నాగరాజు ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని డిప్యూటీ తహసీల్దార్ డి.సుబ్బారావును కలిసి వినతి పత్రం అందజేశారు.

భగవద్గీతపై పోటీలు

త్రిపురాంతకం: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో మండల స్థాయి భగవద్గీత పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి రిటైర్డ్ ప్రిన్స్‌పాల్ టి.మల్లారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అరేశ్వర్ ప్రసాద్ జడ్జిలుగా వ్యవహరించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల నుంచి భగవద్గీత పోటీల్లో పాల్గొన్నారు. పాఠశాలల చిన్నారులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను బాలికలు, బాలుర విభాగంలో శ్రేణీ వారీగా అందజేశారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి గురుస్వామి, ధర్మప్రసార్ ప్రముఖ్ కేవీ రమణారెడ్డి, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు హనుమంతరావు, వాసవీ క్లబ్ ప్రతినిధులు మధు, పవన్, సోమశేఖర్, ఉపాధ్యాయులు రాధాకృష్ణమూర్తి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస పూజలు



స్వామివారిని తాకిన సూర్యకిరణాలు

పుల్లలచెరువు: ధనుర్మాసం ప్రారంభం కావడంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మండలంలోని పలు ఆలయాల్లో ధనుర్మాసం సందర్భంగా భక్తులు ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడివరం రామాలయం పరిధిలో భక్తులు ఉదయాన్నే భజనలు చేసుకుంటూ స్వామి పటంతో నగర సంకీర్తన నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

● పార్టీ యువనేత అన్నా కృష్ణచైతన్య



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సోషల్ మీడియా కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు తనయుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు అన్నా కృష్ణచైతన్య అన్నారు. పట్టణంలోని విశా సుబ్బరత్నం కల్యాణ మండపంలో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన సోషల్ మీడియా మిత్రులతో సోమవారం ఆయన ఆత్మీయంగా సమావేశమై మాట్లాడారు. ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలూ శ్రమించాలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్తపై ఉందన్నారు. ప్రజల అభివృద్ధి కోసం మన ప్రభుత్వంలో ఎటువంటి పథకాలు ప్రవేశ పెట్టారు.. వాటి ప్రయోజనాల గురించి పూర్తిగా వివరించాలన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో ప్రతిపక్ష పార్టీలు తమ పార్టీపై బురద జల్లే కార్యక్రమాలు చేపడుతున్నాయని వాటిని ప్రధానంగా సోషల్ మీడియా మిత్రులే తిప్పికొట్టాలన్నారు. ఎప్పటికప్పుడు వారితో పోరాడేందుకు సంసిద్ధంగా ఉండాలన్నారు. ముందుగా వైఎస్సార్ చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు పూలి రామకృష్ణారెడ్డి, ఓబులరావు, గోడి వెంకటేశ్వరరెడ్డి, బాలచెన్నయ్య, జనార్దన్‌రెడ్డి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ రాజీరెడ్డి, నియోజకవర్గం కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, మండల కన్వీనర్లు పాల్గొన్నారు.

నేడు ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే కేపీ సమావేశం

తర్లుపాడు: మార్కాపురం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9 గంటలకు మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ ముఖ్యనేతలతో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సమావేశమవుతారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. బూత్ లెవెల్ ఏజెంట్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు కూడా హాజరు కావాలని కోరారు.

వేములకోటలో సైబర్ నేరాలపై అవగాహన

మార్కాపురం రూరల్: మండలంలోని వేములకోట గ్రామంలో సోమవారం ట్రైనింగ్ డీఎస్పీ షెహనాజ్ సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. ఇటీవల జిల్లాలో సైబర్‌నేరాలు ఎక్కువయ్యాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా ఫోన్ చేసి బ్యాంకు ఓటీపీ అడిగితే చెప్పవద్దని తెలిపారు. అపరిచిత వ్యక్తులు అనుమనాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి జీవితాలను నాశనం చేసుకోవద్దని రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ సూచించారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ట్రైనీ డీఎస్పీ షెహనాజ్, ఎస్సై

ఇళ్ల లబ్ధిదారులకు వెంటనే బిల్లులు



రికార్డులు పరిశీలిస్తున్న డీఈ నిరీక్షణరావు

ముండ్లమూరు: గృహనిర్మాణ శాఖ మంజూరు చేసిన ఇళ్లు నిర్మించుకున్న వారికి బిల్లులు వెంటనే చెల్లించనున్నట్లు ఆ శాఖ డీఈ నిరీక్షణరావు తెలిపారు. స్థానిక గృహ నిర్మాణశాఖ కార్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. పేదలందరికీ నవరత్నాలు పథకం ద్వారా మండలంలో 480 మంజూరు కాగా అందులో 285 స్లాబ్ స్థాయి వరకు, 29 ఇళ్లు రూఫ్ స్థాయికి చేరుకున్నాయన్నారు. వారందరికీ నిర్మాణ స్థాయిని బట్టి బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. 95 మంది లబ్ధిదారులు నిర్మాణాలు వెంటనే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని చెప్పారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా 833 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. అందులో 123 ఇళ్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన వారు త్వరితగతిన పూర్తి చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఏఈ హనుమంతరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలంలోని బోడపాడు గ్రామంలో నలుగురు దివ్యాంగులకు ప్రభుత్వం వీల్ చైర్లు అందజేసింది. సోమవారం బోడపాడు సర్పంచ్ ఎం వి.రమణారెడ్డి తాండ్ర సునీత, ఎమ్.వెంకటేశ్వరరెడ్డి, వి.పద్మాంజలి, సిందుకూరి వెంకటలక్ష్మికి వీల్ చైర్లు పంపిణీ చేశారు. ప్రభుత్వానికి రుణపడి ఉంటామని లబ్ధిదారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ దిలీప్‌రెడ్డి, డాక్టర్ సుస్మిత, ఏఎంఎం విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.



బోడపాడులో దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ చేస్తున్న రమణారెడ్డి

వన విహారిలో చిత్రలేఖనం పోటీలు



బొమ్మలు వేస్తున్న కళాకారులు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ వై.నరసింహారావు ఆధ్వర్యంలో మండలంలోని దిగువమెట్ట గ్రామ సమీపం వనవిహారి క్షేత్రంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల, గుంటూరు, ప్రకాశం, పల్నాడు జిల్లాలకు చెందిన కళాకారులు పోటీల్లో పాల్గొని వారి ప్రతిభ కనబరిచారు. అభయారణ్యంలోని ప్రకృతి వన్యప్రాణులను ఉట్టిపడేలా కళాకారులు అద్భుత చిత్రాలు గీశారు. పోటీల్లో పాల్గొన్న కళాకారులను అటవీశాఖ అధికారులు శాలువాలు కప్పి మెడల్స్‌తో పాటు ప్రశంసా పత్రాలు అందిస్తు సత్కరించారు. రేంజి ఆఫీసర్ జీవన్‌కుమార్, డిప్యూటీ రేంజర్ వంశీకృష్ణ, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పర్వతరెడ్డి పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి

పెద్దదోర్నాల: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి సోమవారం మండల కేంద్రం పెద్దదోర్నాలకు వచ్చారు. తన సన్నిహితుడు, మండలానికి చెందిన ఉపాధ్యాయుడు సజీవరావు తండ్రి మరణించటంతో ఆయన్ను పరామర్శించారు. మండలానికి చెందిన పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో ఆయన ముచ్చటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సజీవరావు తండ్రి జాన్ వెంకటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో సర్పంచ్ చిత్తూరి హారిక, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి, ఏకలవ్య మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామ్యేల్ జోబ్, మాజీ ఎంపీపీ ప్రభాకర్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటలు నమోదు చేయించుకోవాలి

గిద్దలూరు రూరల్: రైతులు పండించే పంటలను ఆన్‌లైన్ ద్వారా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయశాఖాధికారి విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. మండలంలోని కొండపేటలో సోమవారం ఆయన వ్యవసాయశాఖ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా రైతలు వేసిన పంటలను పరిశీలిస్తూ రైతులు వేసిన పంటను నమోదు చేయించుకోవడం వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు పొందే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం రైతులకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిపై దృష్టి సారించాలి

కొనకనమిట్ల: గ్రామ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులను సర్పంచ్, వార్డు సభ్యులు గుర్తించాలని ఎంపీడీఓ ఎ.శ్రీనివాసమూర్తి సూచించారు. సోమవారం నాగంపల్లి సచివాలయంలో అభివృద్ధి పనుల గుర్తింపుపై గ్రామ సభ నిర్వహించారు. గ్రామంతోపాటు ఎస్సీ కాలనీలల్లో అంతర్గత రహదారుల అభివృద్ధి, సైడు కాలువల నిర్మాణం తదితర పనులపై చర్చించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి ఖాశీం, సచివాలయ ఉద్యోగులు, వార్డు సభ్యులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

రాగులు అన్ని కాలాల్లో పండించవచ్చు

తాళ్లూరు (ముండ్లమూరు): చిరుధాన్యాలైన రాగుల పంటను రైతులు అన్ని కాలాల్లో పండించవచ్చని వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. క్షేత్ర పర్యటనలో భాగంగా సోమవారం చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాగులు పంటను ఖరీఫ్, రబీ సీజన్‌లో నిత్యం పండించవచ్చన్నారు. వాతావరణంలో వచ్చే అన్ని రకాల మార్పులను తట్టుకుని నిలబడే శక్తి రాగి పంటకు ఉందన్నారు. మన ప్రాంతంలో సాధారణంగా సువర్ణ ముఖి, వేగవతి, తురుమల, హిమ, వకుళ రకాలు నికర దిగుబడులనిస్తాయన్నారు. పంట కాలం 80 నుంచి 125 రోజులు ఉంటుందన్నారు. నేలలో విత్తనం చల్లిన తర్వాత బల్లతో గానీ చెట్టు కొమ్మతో గానీ నేలను చదును చేసుకోవాలన్నారు. పైరు పూత, గింజ పాలుపోసుకునే దశల్లో పైరు నీటి ఎద్దడికి గురికాకుండా చూసుకోవాలన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

మార్కాపురం రూరల్: మండలంలోని వేములకోట గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న దూదేకుల ఖాశింను సోమవారం అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ తెలిపారు. నిందితుడి నుంచి 4 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

చెన్నకేశవస్వామి ఆలయ ప్రాకారాలకు రూ.6.11 లక్షల విరాళం

మార్కాపురం టౌన్: శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాకారాల నిర్మాణానికి పట్టణానికి చెందిన దాతలు కందెపు కృష్ణయ్య, మణీంద్ర, మనోజ్ రూ.6,11,116 విరాళాన్ని ఆలయ చైర్మన్ పెనుగొండ కేశవరావుకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ చైర్మన్, కమిటీ సభ్యులు అభినందించారు.



చెక్కు అందజేస్తున్న దాతలు

భారత రాజ్యాంగాన్ని అనుసరించాలి

గిద్దలూరు రూరల్: భారతదేశంలోని ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగాన్ని అనుసరించి జీవించాలని ప్యానల్ న్యాయవాది షేక్ ఫాజిల్ అన్నారు. మైనార్టీల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని షాదీఖానా ఆవరణలో సోమవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. చట్టంలోని హక్కులు, విధులు తెలుసుకుని ప్రతి ఒక్కరూ వారి జీవనాన్ని గడపాల్సి ఉంటుందన్నారు. మండల న్యాయసేవా సంస్థ ద్వారా ఉచితంగా న్యాయసేవలు పొందవచ్చన్నారు. న్యాయవాదులు పిచ్చయ్య యాదవ్, సిద్ధయ్య, జనార్దన్‌రాజు, ముస్లిం మైనార్టీ అభివృద్ధి సంక్షేమ సంఘ అధ్యక్షుడు గుడిసె మహబూబ్‌బాషా, పారాలీగల్ వలంటీర్ మధు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల నూతన కమిటీ ఎంపిక

మార్కాపురం టౌన్: మార్కాపురం మండల యూటీఎఫ్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఓవీ వీరారెడ్డి తెలిపారు. సంఘ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో అధ్యక్షుడిగా పి.అల్లూరిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, కోశాధికారిగా జి.రామకృష్ణ, కార్యదర్శులుగా ఎం.శ్రీను, మస్తాన్, శివశంకర్, శ్రీనివాసులు, అమీర్‌బాషా, రవికుమార్‌రెడ్డి, బాలరంగయ్య, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు, రామారావును ఎన్నుకున్నారు. జిల్లా కౌన్సిలర్లుగా 7 మందిని, గౌరవ సలహాదారుగా గురుస్వామి, సుధాకర్‌రావు, నాగరాజు, గౌరవ అధ్యక్షుడిగా ప్రభాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెన్నా వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు, నాసరయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన మార్కాపురం సీఐ



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ

ఒంగోలు టౌన్: ఇటీవల మార్కాపురం సీఐగా నియమితులై బాధ్యతలు చేపట్టిన ఏ వెంకటేశ్వర్లు సోమవారం ఎస్పీ మలికాగర్గ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకుని ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.